క్లుప్తంగా

మట్టి తరలింపును అడ్డుకున్న స్థానికులు

అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రంలోని గుట్ట నుంచి టిప్పర్ల ద్వారా మట్టిని తరలిస్తుండగా బంగ్లగడ్డకు చెందిన కొందరు నాయకులు మంగళవారం అడ్డుకున్నారు. రామస్వామి గుట్టపై ఉన్న ఆలయం వరకు గుట్ట కింద నుంచి మట్టి దారిని వేస్తూ అక్కడ తొలగించే మట్టిని జానంపేట శివారులోని ఓ వ్యవసాయ భూమికి రెండు రోజులుగా తరలిస్తున్నారని నిలిపేయాలని వాహనాలను అడ్డుకోవడంతో తరలింపు నిలిచి పోయింది.

కొనసాగుతున్న శిబిరం

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో వేసవి తైక్వాండో శిక్షణా శిబిరం కొనసాగుతోంది. జిల్లా తైక్వాండో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సురేందర్‌బాబు ఆధ్వర్యంలో ఈనెల 1 నుంచి శిబిరం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా సురేందర్ బాబు మాట్లాడుతూ..శిబిరంలో ప్రతిభ కనబరిచిన వారిని జిల్లాస్థాయి పోటీలకు ఎంపికచేస్తామని తెలిపారు. వివరాల కోసం సంప్రదించాలని ఆయన కోరారు.

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు

నవాబుపేట: మండలంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను పూర్తి చేసేందుకు ఎమ్మెల్యే నియోజకవర్గం నిధులు రూ.కోటిన్నర మంజూరు అయినట్లు సింగిల్‌విండో చైర్మన్ నర్సింహులు, ఎంపీపీ అనంతయ్య, మార్కెట్ చైర్మన్ లక్ష్మయ్య, జెడ్పీటీసీ రవీందర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ అసంపూర్తిగా ఉన్న కమ్యూనిటీ భవనాలు, గ్రామ పంచాయతీలలో అంతర్గత రోడ్లకు సంబంధించిన పనులు త్వరలోనే పనులు ప్రారంభం అవుతాయన్నారు. ఎమ్మెల్యే లక్ష్మారెడ్డికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ముడా డైరెక్టర్ చెన్నయ్య, ప్రతాప్, యాదయ్య, గోపాల్‌గౌడ్, శ్రీనివాస్‌లు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

దేవరకద్ర: మండలంలోని వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించాలని, ద్విచక్ర వాహనలు నడిపే సమయంలో తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్‌ఐ వెంకటేశ్ మంగళవారం సూచించారు. దేవరకద్రలో వాహనాలను తనిఖీ చేసిన సందర్భంగా మాట్లాడారు. నిబంధనలు పాటించకపోతే కఠినచర్యలు ఉంటాయని హెచ్చరించారు.

అందుబాటులో జీలుగ విత్తనాలు

భూత్పూర్: రైతులకు అందుబాటులో రాయితీపై జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని విండో చైర్మన్ కదిరె అశోక్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ఆగ్రో రైతు సేవాకేంద్రం, సింగిల్ విండో కార్యాలయంలో రాయితీపై జీలుగ విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. రైతులు పట్టాదార్ పాసు పుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్ ఇచ్చి సబ్సిడీపై జీలుగ విత్తనాలు పొందలన్నారు. రైతుబంధు అధ్యక్షుడు నర్సింహులు గౌడ్, సీనియర్ నాయకులు నారాయణ గౌడ్, వైస్‌ఎంపీపీ నరేష్ గౌడ్, ఏవో మురళీధర్, ఏఈవో హర్షవర్ధన్ తదితరులు ఉన్నారు.

మత్స్యకార్మికులకు శిక్షణ

రాజాపూర్ : చేపల పెంపకం, వాటిని పట్టే విధానంపై మంగళవారం మండల పరిధిలోని మల్లేపల్లి గ్రామానికి చెందిన ముదిరాజ్ సంఘం సభ్యులకు మత్స్యకార్మికశాఖ ఆధ్వర్యంలో కోయిల్‌సాగర్‌లో శిక్షణా తరగతులు నిర్వహించారు. ప్రభుత్వం గ్రామాల శివారుల్లో ఉన్న చెరువులు, కుంటల్లో చేపలు పెంచి వాటి ద్వారా ఉపాధి అవకాశాలు పొందేందుకు ముదిరాజ్‌లకు అవకాశం కల్పిస్తోందని సంఘం సభ్యుడు వెంకట్‌రాజ్ పేర్కొన్నారు. ముఖ్యంగా ముదిరాజ్‌లు ఏకతాటిపై ఉండి గ్రామాల్లో సంఘాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. సంఘం అధ్యక్షుడు పోలమోనిశేఖర్, సభ్యులు శ్రీనివాసులు, వెంకట్‌రాజ్,యోగానంద్, రామస్వామి, రాజు ఉన్నారు.

ఇసుక టిప్పర్ సీజ్

మహబూబ్‌నగర్ క్రైం: ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను రూరల్ పోలీసులు సీజ్ చేసి కేసు నమోదు చేశారు. రూరల్ ఎస్‌ఐ వెంకటేశ్వర్లు కథనం ప్రకారం..మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని హౌజింగ్ బోర్డు సమీపంలో మంగళవారం ఉదయం చేసిన తనిఖీల్లో ఓ టిప్పర్‌లో ఇసుక తరలిస్తుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో సీజ్ చేసి, యాజమాని సి.రవి, డ్రైవర్ మల్లేష్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారును ఢీ కొట్టిన లారీ

జడ్చర్ల: రోడ్డుపై ఓ పక్కగా నిలిపిన కారును ఓ లారీ ఢీ కొట్టిన ఘటనిది. కారు డ్రైవర్ నవాబ్ కథనం మేరకు.. జడ్చర్ల కొత్త బస్టాండ్ సమీపంలో సోమవారం అర్ధరాత్రి దాటిన తరువాత మహబూబ్‌నగర్ నుంచి హైదరాబాద్ వెళ్తుతుండగా జడ్చర్ల హౌసింగ్‌బోర్డు దగ్గరకు వచ్చే సరికి నిద్ర రావడంతో కారును డ్రైవర్ నవాబ్ ఓ పక్కకు నిలిపి అందులోనే నిద్రించాడు. ఈ క్రమంలో రాత్రి 2 గంటల ప్రాంతంలో వెనుక నుంచి ఓ లారీ ఢీకొట్టి వెళ్లింది. కాగా డ్రైవర్ ముందు సీట్లో ఉండడంతో అపాయం తప్పింది. ఈ మేరకు నవాబ్ ఫిర్యాదు చేయడంతో కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

పారిశుద్ధ్యంపై 'ప్రత్యేక' శ్రద్ధ


అధికారులతో మట్లాడుతున్న కలెక్టర్ రవినాయక్

• నేటి నుంచి 23 వరకు జిల్లాలోని అన్ని గ్రామాల్లో కార్యక్రమాలు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లాలోని అన్ని గ్రామాల్లో బుధవారం నుంచి 23 వరకు ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను నిర్వహించాలని జిల్లా కలెక్టర్ జి.రవి నాయక్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో రహదారులను శుభ్రం చేయడం, గుంతలు పూడ్చడం, పిచ్చి మొక్కల తొలగింపు, మురుగు కాల్వ శుభ్రం వంటి చర్యలు చేపట్టాలని సూచించారు. లోతట్టు ప్రదేశాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని, పడిపోయిన ఇళ్లు, శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనాలు, ఇతర వాటిని గుర్తించి వెంటనే తొలగించాలన్నారు.

➡ వ్యాధుల బారిన పడకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఫాగింగ్, నీటి గుంటలలో ఆయిల్ బాల్స్ వేయడం, గంబూసియా చేపలు వదలటం వంటివి చేపట్టాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రై డే నిర్వహించాలని సూచించారు.

➡ కార్యదర్శులు మ్యాజిక్ సోక్ పిట్లు, కిచెన్ గార్డెన్‌లపై దృష్టి సారించాల్సిందిగా ఆదేశించారు. ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమ నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

➡ జిల్లాలో 41 శాతం మాత్రమే క్రీడా ప్రాంగణాలు చేపట్టారని ఎంపీడీవోలు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ప్రత్యేక అధికారులు తహసీల్దార్లు, ఎంపీడీఓలు ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేయాలన్నారు.

➡ ఉపాధి హామీ పథకం కింద కూలీల సంఖ్య తక్కువగా ఉండడం, వేతన దినాల సంఖ్య తక్కువగా ఉండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సంఖ్య పెంచడంపై శ్రద్ధ చూపాలన్నారు.

➡ స్థానిక సంస్థలు, రెవెన్యూ అదనపు కలెక్టర్ కె. సీతారామరావు మాట్లాడుతూ వైకుంఠదామాలలో సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. క్రీడా ప్రాంగణాలకు స్థలాలు గుర్తించాలని, కొనుగోలు కేంద్రాలు సందర్శించాలని అన్నారు. డీపీఓ వెంకటేశ్వర్లు, డీఆర్‌డీఓ యాదయ్య, డీఎల్‌పీఓ వరలక్ష్మి, మండల ప్రత్యేక అధికారులు హాజరయ్యారు.

ఎన్నికల జాబితాపై సమావేశం

శుద్ధీకరించిన ఓటరు జాబితానే లక్ష్యమని జిల్లా రవినాయక్ అన్నారు. మంగళవారం ఆయన తన చాంబర్లో ఓటరు జాబితా, ఎన్నికల అంశాలపై అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఓటరు జాబితా ప్రత్యేక సవరణ అనంతరం రాజకీయ పార్టీలకు అందజేసిన తుది జాబితా ఆధారంగా ఎక్కడైనా పొరపాటుగా పేర్లు తొలగించినా, కొత్తగా చేర్చాల్సినా చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే ఒక ఇంట్లో 6 మందికి మించి ఓటర్లు ఉన్నట్లయితే మరోసారి పరిశీలిస్తామన్నారు. ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు పార్టీలు బూత్ స్థాయి ఏజెంట్లను నియమించాలని కోరారు. అదేవిధంగా నూతన పుట్టిన తేదీలు మార్చుతామన్నానరు. జూన్ 1 నుంచి ఈవీఎంల ఫస్ట్ లెవెల్ చెకింగ్ ఉంటుందని పార్టీలను ఆహ్వానిస్తామన్నారు. ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులు వారి సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఆయా పార్టీల నాయకులు సత్యం యాదవ్, రాజేందర్ రెడ్డి, ఇద్రిస్, సామ్యూల్, సాధాతుల్లా తదితరులు ఉన్నారు.

సంక్షేమ పథకాల్లో తెలంగాణ భేష్


గాధిర్యాల్‌లో సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహేశ్ రెడ్డి

మహమ్మదాబాద్: ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడంలో దేశంలోనే నంబర్‌వన్ స్థానంలో తెలంగాణ ఉందని పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. పల్లెబాట కార్యక్రమంలో భాగంగా సోమవారం మండల పరిధిలోని ఆముదాలగడ్డతాండ, గాధిర్యాల్, చౌదర్‌పల్లి, మంగంపేట్, మొకర్లాబాద్, జూలపల్లి గ్రామాల్లో పర్యటించారు. పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ప్రభుత్వ పథకాలు గడపగడపకూ అందుతున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల అభివృద్ధికి కృషిచేస్తోందని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మాధవి, జెడ్పీటీసీ శ్రీనివాస్ రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు వెంకట్రాంరెడ్డి, బొయిని వెంకటమ్మ, రమేష్, శ్రీనివాస్, రక్షిత, కిరణ్ కుమార్‌రెడ్డి, వైస్‌ఎంపీపీ ఈశ్వర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్ యాదయ్య

జడ్చర్ల: మండల పరిధిలోని కోడ్గల్‌లో మంగళవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జెడ్పీ వైస్ చైర్మన్ యాదయ్య ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. తక్కువ ధరలకు అమ్ముకోకుండా ప్రభుత్వ మద్దతు ధరలకు తమ ధాన్యాన్ని అమ్ముకుని లబ్ధిపొందాలని కోరారు. తమ ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని, రైతు పక్షపాతిగా వ్యవహరిస్తుందన్నారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ సుదర్శన్, మార్కెట్ చైర్మన్ గోవర్ధన్, సర్పంచ్ మమత, ముడా డైరెక్టర్ ఇమ్ము, తదితరులు పాల్గొన్నారు.

'పది'టాపర్‌కు మంత్రుల అభినందన


వైష్ణవిని సత్కరిస్తున్న మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్

అడ్డాకుల: పదో తరగతి ఫలితాల్లో జిల్లా టాపర్‌గా నిలిచిన మూసాపేట విద్యార్థి వైష్ణవిని మంగళవారం హైదరాబాద్‌లో మంత్రులు అభినందించారు. రాష్ట్ర సగర సంఘం నాయకులు వైష్ణవితో కలిసి రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డిని కలిశారు. జిల్లా టాపర్‌ను మంత్రి సబిత శాలువాతో సత్కరించి అభినందించారు. బాసర ఐఐఐటీలో సీటు ఇప్పించే విధంగా కృషి చేస్తానని మంత్రి చెప్పినట్లు సగర సంఘం నాయకులు తెలిపారు. అదేవిధంగా రాష్ట్ర ఎక్సైజ్, క్రీడలశాఖ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్‌ను కలిశారు. ఆయన వైష్ణవిని శాలువాతో సత్కరించి విద్యార్థిని ఉన్నత చదువులకు సాయం చేస్తానని ప్రకటించారు. కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అస్కాని మారుతిసాగర్, సగర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పరి శేఖర్, గౌరవ అధ్యక్షుడు హరికిషన్, మీర్‌పేట్ కార్పొరేటర్ బాలకృష్ణ, మూసాపేట సగర సంఘం అధ్యక్షుడు బీసం రాఘవులు, పాఠశాల హెచ్‌ఎం భాస్కర్ తదితరులు ఉన్నారు.

అబ్దుల్ సాహెబ్ దర్గాలో ఉర్సు

అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రంలోని నిజాలాపూర్ రోడ్డు పక్కన ఉన్న హజ్రత్ అబ్దుల్ సాహెబ్ దర్గాలో మంగళవారం రాత్రి ఉర్సు నిర్వహించారు. గ్రామంలోని షేక్‌బాలీ ఇంటి నుంచి గంధంను బయటకు తీశారు. ప్రధాన వీధుల్లో ఊరేగింపు చేపట్టారు. భక్తి పాటలకు యువకులు నృత్యాలు చేస్తూ ఊరేగింపుగా దర్గా వద్దకు చేరుకున్నారు. దర్గాలో గంధం, పూలను సమర్పించి ఫాతేహాలిచ్చారు. అన్నదానం చేశారు. ముస్లిం మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత


వీధులు శుభ్రం చేస్తున్న చైర్మన్ బస్వరాజ్ గౌడ్ తదితరులు

భూత్పూర్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం అందరి బాధ్యత అని మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్ గౌడ్ అన్నారు. మున్సిపాలిటీలోని గోప్లాపూర్ 3వ వార్డులో స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా తడి, పొడి చెత్త వేరుచేయడం, పరిసరాల పరిశుభ్రతపై మంగళవారంగ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. వీధులు శుభ్రం చేశారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో అధికారులకు, సిబ్బందికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ శ్రీనివాస్‌రెడ్డి, కమిషనర్ నజీబ్, నాయకులు సత్యనారాయణ, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

'కంటి వెలుగు'ను వినియోగించుకోవాలి



చిన్నచింతకుంట: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఏదులాపూరం సర్పంచ్ హేమలత, ఎంపీటీసీ ఉషారాణి అన్నారు. గ్రామంలో మంగళవారం కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ పేద ప్రజలకు ఉచిత వైద్యం అందించేలా కృషి చేస్తున్నాడన్నారు. గ్రామస్తులు, వైద్యబృందం తదతరులు ఉన్నారు.

బాక్స్ ఫ్లడ్‌లైట్ క్రికెట్ టోర్నీ


విజేతలతో కౌన్సిలర్ కిషోర్ తదితరులు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రం తిరుమలహిల్స్‌లో ఫ్లడ్‌లైట్ల వెలుతురులో ఆదివారం, సోమవారం అర్ధరాత్రి వరకు బాక్స్ క్రికెట్ టోర్నీ నిర్వహించారు. టోర్నీలో 22 జట్లు పాల్గొన్నాయి. టోర్నీని మార్కెట్ కమిటీ చైర్మన్ అబ్దుల్ రెహమాన్ ప్రారంభించారు. సోమవారం రాత్రి జునైద్-తాహెర్ జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ జరిగింది. తాహెర్ జట్టు 8 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 54 పరుగులు చేయగా అనంతరం బ్యాటింగ్ చేసిన జునైద్ లెవన్ జట్టు 7 ఓవర్లలో 1 వికెట్ కోల్పోయి 55 పరుగులు చేసి విజేతగా నిలిచారు. ముగింపు కార్యక్రమంలో కౌన్సిలర్ కిషోర్ పాల్గొని మాట్లాడుతూ యువత క్రీడల్లో రాణించాలని కోరారు. రాష్ట్ర మంత్రి శ్రీనివాస్‌గౌడ్ జిల్లాలో క్రీడాభివృద్ధి కోసం ఎంతో కృషి చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయస్థాయిలో రాణించాలని కోరారు. అనంతరం విన్నర్ జట్టుకు ట్రోఫీ రూ.5వేలు, రన్నరప్ జట్టుకు ట్రోఫీ రూ.3వేల నగదు అందజేశారు. టోర్నీ ఆర్గనైజర్, వక్ఫ్ కాంప్లెక్స్ కమిటీ సభ్యులు మహ్మద్ అల్తాఫ్ హుస్సేన్, రాష్ట్ర ఫోటో, వీడియో గ్రాఫర్స్ సంఘం ఉపాధ్యక్షులు సయ్యద్ నుస్రత్‌అలీ, సయ్యద్ వాజిద్‌అలీ, మాజిద్ బేగ్, జాహెద్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వార్షికోత్సవం



మిడ్జిల్: మండల కేంద్రంలో బొడ్రాయి 4వ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా చండిహోమం నిర్వహించారు. అనంతరం అభిషేకం, సాయంత్రం బోనాలతో నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ రాధిక, ఎంపీటీసీ గౌస్, గ్రామ పెద్దలు శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, అల్వాల్‌రెడ్డి, వెంటయ్య, శంకరయ్య, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనానికి తరలిరావాలి

చిన్నచింతకుంట: బీఆర్ఎస్ చిన్నచింతకుంటలో నిర్వహించే ఆత్మీయ సమ్మేళనానికి గ్రామస్తులు తరలి రావాలని గూడూర్ సర్పంచ్ కాంతరావు కోరారు. ఈనెల 18న సమ్మేళనానం ఉంటుందన్నారు. గూడూర్‌లో మంగళవారం ఇంటింటికి తిరిగి ఆహ్వానించారు. ఈ మేరకు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

ఉత్సాహంగా పోటీలు


మిడ్జిల్‌లో పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ సుదర్శన్ తదితరులు

మిడ్జిల్: గ్రామీణా స్థాయిలో క్రీడాకారుల ప్రతిభ వెలికితీసేందుకే సీఎం కప్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ సుదర్శన్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. మండలస్థాయిలో సత్తా చాటితే ఆ తరువాత జిల్లా అటునుంచి రాష్ట్రస్థాయి పోటీలకు వెళ్లడానికి ఆస్కారం ఉంటుందన్నారు. యువకులు అధిక సంఖ్యలో పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తహసీల్దార్ రాజీవ్‌రెడ్డి, ఎంపీడీఓ సాయిలక్ష్మి, ఎంపీటీసీ గౌస్, సర్పంచ్ మంగమ్మ, నాయకులు పాల్గొన్నారు.

అడ్డాకుల: మూసాపేట, అడ్డాకుల మండల కేంద్రాల్లో మంగళవారం సీఎం కప్ పోటీలను ప్రారంభించారు. అడ్డాకులలో జెడ్పీటీసీ రాజశేఖర్‌రెడ్డి, ఎంపీపీ నాగార్జునరెడ్డి, తహసీల్దార్ కిషన్, ఎంపీడీఓ మంజుల, విండో అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి,


అడ్డాకులలో ..

మూసాపేటలో ఎస్‌ఐ విజయ భాస్కర్ పోటీలను ప్రారంభించారు.

భూత్పూర్: మండలంలో విజేతలకు మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్ గౌడ్, మెడల్స్, పత్రాలను అందజేశారు. మత్స్య సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, సీనియర్ నాయకులు నారాయణ గౌడ్, వైస్‌ఎంపీపీ నరేష్ గౌడ్, తహసీల్దార్ చెన్నకిష్టన్న తదితరులు ఉన్నారు.

జిజ్ఞాస పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



జడ్చర్లటౌన్: రాష్ట్ర జిజ్ఞాస విద్యార్థి పరిశోధక ప్రాజెక్ట్ పోటీలలో జడ్చర్ల బీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. మూలధ్వని-జానపద, గిరిజన, సంగీత వాయిద్యాల సామాజిక చరిత్ర అంశంపై తెలుగులో తృతీయ బహుమతిగా రూ.12వేల నగదు పురస్కారం, హిందీ భాషాభివృద్ధిలో సమాచారం సాంకేతిక పరిజ్ఞానం తోడ్పాటు అనే అంశంపై ద్వితీయ బహుమతిగా రూ.21 వేల నగదు పొందారు. ఈ సందర్భంగా విద్యార్థులను మంగళవారం ప్రిన్సిపాల్ అప్పియ్య చిన్నమ్మ, వైస్ ప్రిన్సిపాల్ రవీందర్ రావు అభినందించారు.

ఘనంగా బ్రహ్మోత్సవాలు

మిడ్జిల్: మసిగొండ్లపల్లిలో భ్రమరాంభికా దేవీ, కాశీ పంచలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా నేత్రపర్వంగా రథోత్సవం చేపట్టారు. వేడులకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి అనిరుధ్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనను గ్రామస్తులు శాలువతో సన్మానించారు. అనంతరం బ్రహ్మోత్సవాలకు తనవంతు సాయంగా రూ.50వేల నగదును అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అల్వాల్‌రెడ్డి, సంపత్ తదితరులు పాల్గొన్నారు.



డెంగీ నిర్మూలనే లక్ష్యం


గండేడ్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది


భూత్పూర్‌లో..

భూత్పూర్: గ్రామీణ ప్రాంతాలల్లో ప్రజలకు వచ్చే వ్యాధుల పట్ల వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, డెంగీపై అవగాహన కల్పించాలని మండల వైద్యాధికారి డా. అబ్దుల్ రబ్ అన్నారు. భూత్పూర్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా ఏఎన్‌ఎం, ఆశ, వైద్య సిబ్బందికి సూచనలు, సలహాలు ఇచ్చారు. పట్టణంలోని చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. సీహెచ్‌వో రామయ్య, వైద్య సిబ్బంది ప్రవీణ కుమారి, హెల్త్ సూపర్‌వైజర్ సుధాకర్, హెల్త్ అసిస్టెంట్లు పుష్పలీల, విజయ, కృపావతి, ప్రమోద్ కుమార్, శ్రీనివాస్ ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

దేవరకద్ర: మండల కేంద్రంలో నిర్వహించిన ర్యాలీ సందర్భంగా వైద్యాధికారి శృతి తీవ్ర మైన తలనొప్పి, జ్వరం, దద్దుర్లు రావడం, కండరాలు, కీళ్లనొప్పులు, చర్మం ద్వారా రక్తస్రావం కావడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే పీహెచ్‌సీలో వైద్య పరీక్షలు చేసుకోవాలని సూచించారు. సీహెచ్‌ఓ పరమేశం ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

అడ్డాకుల: జాతీయ డెంగీ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం అడ్డాకుల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డెంగీ నిర్మూలనే లక్ష్యంగా చర్యలు తీసుకోవాలని, దోమల వల్ల వ్యాధి వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందున వాటి నివారణకు కృషి చేయాలని ప్రచారం చేశారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ చరత్‌చంద్ర, డాక్టర్ దీపిక, సీహెచ్‌ఓ భాస్కర్, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు ఉన్నారు.

మిడ్జిల్: మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారిణి మనుప్రియా, సూపర్‌వైజర్ మరియమ్మ, సిబ్బంది దేవయ్య, జంగయ్య, బాలమణి, రాజేశ్వరి, నీలమ్మ, తిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.

గండేడ్: మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద నుంచి నిర్వహించిన ర్యాలీలో వైద్యాధికారి చంద్రశేఖర్, సీహెచ్‌ఓ రాములు, సూపర్‌వైజర్లు అంబదాస్, అలివేలు , హెల్త్ అసిస్టెంట్ గోపాల్, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.


అడ్డాకులలో ..


దేవరకద్రలో..

నియామక పత్రం అందజేత

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పీయూలో గతంలో నిర్వహించిన రిక్రూట్‌మెంట్‌లో విద్యార్థి మహ్మద్ ఆదీర్ అహ్మద్ కె12 టెక్నాలజీలో బిజినెస్ డెవలప్‌మెంట్ అసోసియేట్‌గా ఎంపియ్యారు. ఈమేరకు విద్యార్థికి వీసీ లక్ష్మీకాంత్ రాథోడ్ నియామక పత్రం అందజేశారు. ఓఎస్డీ మధుసూదన్‌రెడ్డి, రిజిస్ట్రార్ గిరిజ పాల్గొన్నారు.